క్లుప్తంగా

స్పందనకు 17 అర్జీలు

నందిగామ: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. కార్యాలయ ఏవో రాజకిశోర్ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మొత్తం 17 అర్జీలు అందాయని వాటిలో రెవెన్యూ 9, విద్యుత్ శాఖ 1, హౌసింగ్ 2, పోలీస్ శాఖ 3, ఇరిగేషన్ 1, పంచాయతీ రజ్ 1 చొప్పున అర్జీలు అందాయని ఏవో తెలిపారు.

రాజన్న ఉచిత భోజనానికి విశేష స్పందన



భోజనం వడ్డిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

జగ్గయ్యపేట అర్బన్: మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాల స్ఫూర్తితో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను స్థానిక పార్టీ కార్యాలయంలో నిరంతరం కొనసాగే విధంగా ఏర్పాటుచేసిన రాజన్న ఉచిత భోజన కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా 5వ రోజు సోమవారం పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా పలు పనుల నిమిత్తం పట్టణానికి వచ్చిన చిరు వ్యాపారులు, వివిధ వృతుల వారు, విద్యార్థులు, అనాథ వృద్ధులు, నిరాశ్రయులు సమారు 800 మందికి పైగా తరలివచ్చి తమ ఆకలి తీర్చుకున్నారు. గండ్రాయి గ్రామానికి చెందిన గణితి మనోజ్‌కుమార్ మేనకోడలు పుట్టినరోజు సందర్భంగా క్యాంటిన్‌లో అన్నదానం ఏర్పాటుచేశారు.

ఆర్‌బీకేలలో సిద్ధంగా యూరియా

వత్సవాయి: రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అందబాటులో యూరియా సిద్ధంగా ఉందని మండల వ్యవసాయాధికారి వి. రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కావల్సిన రైతులు తమ ఆధార్ జిరాక్స్‌తో వచ్చి యూరియా బస్తాలను తీసుకోవచ్చన్నారు. బస్తా ధర రూ. 270 లకే రైతులకు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

నందిగామ: మండలంలోని పెద్దవరం గ్రామానికి చెందిన మార్కపూడి వెంకటేశ్వరరావు ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతి చెందిన సంగతి పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబానికి గ్రామానికి చెందిన కంపాషన్ కమ్యూనిటీ ఆఫ్ సర్వీసెస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రూ. 4 వేలు చెక్ రూపంలో అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రవీణ్, వినోద్, పూర్ణయ్య, బాలయ్య పాల్గొన్నారు.

శరవేగంగా తాగునీటి పథకం పునరుద్ధరణ పనులు

పెనుగంచిప్రోలు: మునేరు వరద ఉద్ధృతి కారణంగా గ్రామానికి రక్షిత మంచినీటిని అందించే పథకానికి సంబంధించిన పైపులైన్ కొట్టుకుపోయింది. దీంతో ఆ పైపులైన్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నామని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి తెలిపారు. అప్పటి వరకూ తాగునీటికి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. తూర్పు బజారుకు సంబంధించి ఇప్పటికే పైపులైన్ పునరుద్ధరణ పనులు పూర్తి చేసి తాగునీటి సరఫరా చేస్తున్నామని సర్పంచ్ వివరించారు. గ్రామం మొత్తానికి తాగునీటి సరఫరా పునరుద్ధరించేందుకు పగులు, రాత్రి తేడా లేకుండా కృషి చేస్తున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆదేశాలతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు పనులు చేస్తున్నామని, రెండు రోజుల్లో పూర్తి చేసి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామన్నారు. పరిస్థితిని ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు.

మణిపాల్‌లో అవయవదానం

తాడేపల్లిరూరల్: అనారోగ్యంతో మణిపాల్ హాస్పిటల్‌లో చేరిన ఒక వ్యక్తికి బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో అతని అవయవాలతో మణిపాల్ హాస్పిటల్ వైద్యులు ఆ వ్యక్తి కుటుంబ సభ్యుల అనుమతితో మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపారు. సోమవారం మణిపాల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కంటిపూడి సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ జిల్లా, గోదావరి వీధి, అరండల్‌పేట, వీటీసీకి చెందిన టి. వీరభద్రరావు (68) అనారోగ్యంతో స్థానికంగా ఉన్న హాస్పిటల్‌లో చేర్పించారు. మెరుగైన వైద్య నిమిత్తం తాడేపల్లిలోని మణిపాల్ హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. అప్పటికే అతను స్పృహ కోల్పోయి ఉండడంతో వైద్య పరీక్షల అనంతరం అతని బ్రెయిన్ డెడ్ అయినట్లు పరిగణించారు. అతని భార్య టి. అనూరాధ, కుమార్తె, కుమారుడు అంగీకారం మేరకు ఏపీ జీవన్‌దాన్ చైర్మన్ డాక్టర్ కె. రాంబాబు ఆధ్వర్యంలో అవయవదానం జరిగిందని, కాలేయం, ఒక కిడ్నీని మణిపాల్ హాస్పిటల్‌లో అవసరమయిన వారికి ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించామని, కార్నియా ఎల్.వి. ప్రసాద్ ఐ హాస్పిటల్ విజయవాడ, మరొక కిడ్నీ వేదాంత్ హాస్పిటల్, గుంటూరు తరలించామని తెలిపారు. అవయవదానానికి అంగీకరించి మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపిన వీరభద్రరావు కుటుంబానికి మణిపాల్ హాస్పిటల్స్ ధన్యవాదాలు తెలియజేస్తోందని అన్నారు.

నిరుపేదల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



అల్లూరులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

అల్లూరు(వీరులపాడు): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి నిరుపేదల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పాటు నందిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో సోమవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి అని గత పాలకుల మాదిరిగా ప్రచారానికే పరిమితం కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల్లో చేసి చూపుతున్నారన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రత్యేక చర్యలు..

గత ప్రభుత్వాలు మహిళలను విస్మరిస్తే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం మహిళల సంక్షేమం, రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని జగన్‌మోహనరావు చెప్పారు. మహిళల భద్రతకు ఏర్పాటు చేసిన దిశ యాప్ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. ముఖ్యంగా మహిళా రక్షణకు అధిక ప్రాధాన్యమివ్వటంతో పాటు ప్రతి ఒక్క సంక్షేమ పథకంలోను మహిళలను భాగస్వాములను చేస్తున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా గత ప్రభుత్వాలకు సాధ్యం కాని రీతిలో నామినేటెడ్ పదవులలో సైతం మహిళలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

ప్రజల మంచి కోరే ప్రభుత్వం..

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల మంచి కోరే ప్రభుత్వమని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రానున్న ఎన్నికలలో మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, సర్పంచ్ బందెల రాణి, వైఎస్ ఎంపీపీ వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యురాలు మోంద్రు బాయమ్మ, నాయకులు కుంపటి శ్రీను, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలకు నిరసనగా శాంతి ర్యాలీ



నందిగామలో నిర్వహిస్తున్న శాంతి ర్యాలీ

నందిగామ: గత కొంతకాలంగా మణిపూర్‌లో జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పలు ప్రజా సంఘాలు, క్రైస్తవ, ముస్లిం, లౌకిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నందిగామ పట్టణంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ జాతీయ జెండా, పలు ప్లకార్డ్స్ చేత బూని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ సెంట లో మానవహారం ఏర్పాటు చేశారు. ఆ తర్వాత స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మణిపూర్‌లో హింసకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. అక్కడి దాడుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆ తర్వాత గద్దర్ కు నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బచ్చల కూర పుష్పరాజ్, కేజెడ్‌ఎస్ కుమార్, షేక్ కాజా, ఖలీల్ అహ్మద్ రిజ్వి, మున్నాభాయ్, సైదులు, షేక్ జాఫర్, కోటా రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కారకులను కఠినంగా శిక్షించాలి

వత్సవాయి: మణిపూర్ మారణహోమానికి కారకులైన వారిని వెంటనే శిక్షించాలని కోరుతూ మండల సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని గాంధీపార్క్ సెంటర్‌లో చేపట్టి అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు తమ్మినేని రమేష్ మాట్లాడుతూ అరాచకశక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బీజేపీ మతరాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు. మతకలహాలను సృష్టించి రాజకీయాలను చేయాలని చూస్తూ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. మణిపూర్ ఘటన యావత్‌దేశాన్ని తలదించుకునేలా చేసిందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సీహెచ్ హనుమంతురావు, ఎం. చంద్రశేఖర్, బి. రాము, వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, దేవయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మణిపూర్ ఘటనపై కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం పార్టీ నాయకులు

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



పూడికతీత పనుల ప్రారంభంలో జెడ్పీటీసీ నాగమణి, సర్పంచ్‌లు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముండ్లపాడు గ్రామ సమీపంలో శనగపాడు-2 ఎన్ఎస్‌పీ కాలువలో పూడికతీత పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌పీ డీఈ రాంబాబు మాట్లాడుతూ కాలువలో 7.3 కిలో మీటర్ నుంచి 9.9 కిలోమీటర్ వరకు ఈ పూడికతీత జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముండ్లపాడు, తోటచర్ల, వెంకటాపురం సర్పంచ్‌లు గూడపాటి లావణ్య, కునగుంట్ల రాములమ్మ, కూచి నర్సయ్య, వైస్ ఎంపీపీ గూడపాటి వాసు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, కూచి శ్రీనివాసరావు, ఎత్తిపోతల పథకం అధ్యక్షులు పొన్నం వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం

పెనుగంచిప్రోలు: మండలంలోని విద్యుత్ సెక్షన్ పరిధిలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు విజయవాడ రూరల్ ఈఈ బి. శ్రీనివాసరావు అన్నారు. అధికలోడు వాడుతున్న 274 సర్వీసులను గుర్తించి వీరికి రూ.6,94,000 అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, విద్యుత్ చౌర్యం చేస్తే వివరాలను 9440812085కు తెలపాలన్నారు. వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఈ కేవై కొండలరావు, నందిగామ డీఈ రమేష్‌బాబు, పెనుగంచిప్రోలు ఏఈ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి



వీరులపాడు: వైద్యారోగ్య సిబ్బంది క్రమం తప్పకుండా గర్భిణులు, చిన్నారులకు టీకాలు వేయాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి పేర్కొన్నారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా వీరులపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆమె టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యారోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి టీకాలు వేయాలన్నారు. టీకాలు వేయించుకోవటం వల్ల గర్భిణులు, చిన్నారులకు క్షయ, పోలియో, ధనుర్వాతం, తట్టుతో పాటు పలు రకాల వైరస్‌లు, వ్యాధులు దరిచేరవని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు దీపక్, గౌతమ్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పుష్కలంగా సాగునీరు



వేపలవాగు పూడికతీత పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: వేపలవాగు పూడిక తీత ద్వారా రైతులకు పుష్కలంగా సాగు నీటి సరఫరా అవుతుందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని తిరుమలగిరి క్రాస్ రోడ్ నుంచి ఆర్టీసీ కాలనీ, వైవై కాలనీ, సీతారామపురం తదితర ప్రాంతాల మీదుగా ప్రవహిస్తూ ఊర చెరువులోకి కలుస్తున్న వేపలవాగు పూడికతీత పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉదయభాను ఆదేశాల మేరకు ఊర చెరువుపై ఆధారపడిన రైతులకు నీరందించేందుకు వేపలవాగులో ఈ పూడిక తీత పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వేపలవాగులోని కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణలు జరగడం గుర్తించామని, ఇప్పటికే మున్సిపల్ అధికారులు వేపలవాగు హద్దులు సర్వే చేస్తున్నారన్నారు. ఆక్రమణలు ఉంటే వాటిని తొలగించి పూడికతీత పనులు జరుగుతాయని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ పౌష్టికాహార కిట్‌లు అందజేత



సంపూర్ణ పోషణ కిట్‌లు అందజేస్తున్న సూపర్‌వైజర్

ముక్త్యాల(జగ్గయ్యపేట): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సువర్ణ మాట్లాడుతూ ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లను గర్భిణులు, బాలింతలకు అందిస్తోందన్నారు. ఈ కిట్‌లలో పౌష్టిక విలువలు కలిగిన అన్ని రకాల నిత్యావసర సరుకులుంటాయని తెలిపారు. అంతే కాకుండా చిన్నారులను కూడా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు కిట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు శ్రీదేవి, వనజారాణి, కుమారి, కమల పాల్గొన్నారు.

నేడు విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యుత్ ఉద్యోగుల ధర్నా కారణంగా సామాన్య ప్రజలకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నగరంలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు, ఆంక్షలు అమలులో ఉంటాయని పోలీస్ కమిషనర్ కార్యాలయం సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేసింది.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా...

- చుట్టుగుంట నుంచి రామవరప్పాడు వైపునకు పడవల రేవు మీదుగా ఎటువంటి వాహనాలు అనుమతించరు.
- మధురానగర్ జంక్షన్ నుంచి రామవరప్పాడు వైపునకు పడవల రేవు మీదుగా వాహనాలు అనుమతించరు.
- రామవరప్పాడు నుంచి పడవల రేవు (ఏలూరు రోడ్) వైపు ఎలాంటి వాహనాలు అనుమతించరు.
- గుణదల పోస్టాఫీస్ జంక్షన్ నుంచి ఈఎస్ఐ హాస్పిటల్ కటింగ్ (ఏలూరు రోడ్) వైపు ఎలాంటి వాహనాలు అనుమతించరు.
- చుట్టుగుంట నుంచి రామవరప్పాడు వెళ్లాల్సిన వాహనదారులు చుట్టుగుంట జంక్షన్ నుంచి నైస్ బార్ జంక్షన్ - మధు చౌక్ - జమ్మిచెట్టు సెంటర్ - సిద్ధార్థ జంక్షన్ - అమ్మ కల్యాణ మండపం జంక్షన్ వద్ద కుడి వైపునకు రమేష్ హాస్పిటల్ జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- రామవరప్పాడు నుంచి ఏలూరు రోడ్, బీఆర్టీఎస్ రోడ్డుకు వెళ్లాల్సిన వాహనచోదకులు రామవరప్పాడు నుంచి మహానాడు జంక్షన్ - రమేష్ హాస్పిటల్ జంక్షన్ వద్ద కుడి వైపునకు, అమ్మ కల్యాణమండపం వద్ద ఎడమ వైపునకు, సిద్ధార్థ కాలేజి జంక్షన్, జమ్మి చెట్టు సెంటర్, మధు చౌక్, నైస్ బార్ జంక్షన్, పుష్ప హోటల్ జంక్షన్, దీప్తి జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- ఈఎస్ఐ హాస్పిటల్ కటింగ్ (ఏలూరు రోడ్) నుంచి రామవరప్పాడుకు విద్యుత్ సౌధ మీదుగా ఎలాంటి వాహనాలకుగానీ, పాదచారులకుగానీ అనుమతి లేదు.

వాహనచోదకులు, ప్రజల ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సెంట్రల్ జైలు ఖైదీ ఆత్మహత్య

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీ మన్నే రాజేష్ (39) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణా జిల్లా వత్సవాయికి చెందిన రాజేష్ హత్య కేసులో జగ్గయ్యపేట జైలుకి వచ్చాడు. అయితే అతడి ఆరోగ్య కారణాలతో మేజిస్ట్రేట్ ఆదేశాలతో ఈ ఏడాది ఏప్రిల్ 18న రాజమమహేంద్రవరం సెంట్రల్ జైలుకి తరలించారు. రాజమహేంద్రవరం జైలులోని ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో జైలుతో ఉరివేసుకున్నాడు. గమనించిన సిబ్బంది వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయాన్ని అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఘటనపై ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో జైలు అధికారులు ఫిర్యాదు చేశారు.

ఆదినారాయణ కృషి మరువలేం

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమాజంలో పేద విద్యార్థులు అభివృద్ధి చెందడానికి పింగళి ఆదినారాయణ చేసిన కృషిని మరువలేమని ఎల్‌ఐసీ ఏఓ పింగళి శ్రీరాములు అన్నారు. చైల్డ్ సైకాలజిస్ట్‌గా పని చేసిన ఆయన 'గిజోభాయ్' విధానాన్ని అమలు పరచిన తీరుతో విద్యార్థులలో సమానత్వాన్ని పెంపొందించారని తెలిపారు. పింగళి ఆదినారాయణ వర్ధంతి పురస్కరించుకుని విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పింగళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

నేతన్న నేస్తం చేనేత కార్మికులకు అండ

ప్రభుత్వ విప్ ఉదయభాను



చేనేత కార్మికుడిని సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా రాష్ట్రంలోని చేనేత కార్మికులకు అండగా ఉన్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో పేట మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు దేవరశెట్టి వీరభద్రంను ఉదయభాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులై ఉండి సొంత మగ్గం కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ. 24 వేలు అందిస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, పట్టణ చేనేత విభాగం అధ్యక్షుడు పెనుమల్లి చంద్రమౌళి, పద్మశాలీ సంఘం ప్రతినిధులు అల్లి రవిచంద్, మునిని శివ, రెబ్బ నరసింహారావు, పిల్లలమర్రి లక్ష్మీనారాయణ, రుషికుమార్, రాజేశ్వరి పాల్గొన్నారు.

రైతు సంక్షేమం, అభివృద్ధికి నిరంతర కృషి

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



విద్యుత్ మోటార్ల స్విచ్ ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

కంచికచర్ల: రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని నందిగామ నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని మున్నలూరు గ్రామంలో సోమవారం సంగమేశ్వరస్వామి ఎత్తిపోతల పథకం పంపింగ్ స్కీం విద్యుత్ మోటార్ల స్విచ్ ఆన్‌చేసి సాగునీటిని విడుదల చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ ఎత్తిపోతల పథకం స్కీం కింద మున్నలూరు, కునికెనపాడు, మోగులూరు గ్రామాలకు చెందిన 700 ఎకరాల ఆయకట్టు భూమి ఉందని, ఆ భూములకు సాగునీరు అందుతుందన్నారు. చివర ఆయకట్టు భూములకు సాగునీరు అందించేందుకు స్కీం కమిటీ సభ్యులు ముందుచూపుతో పనిచేయాలని సూచించారు. రైతులు సాగునీటి వాటాను సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి, వైఎస్ ఎంపీపీ బండి మల్లిఖార్జునరావు, స్కీం కమిటీ చైర్మన్, నాయకులు రాయల నరసింహారావు, చింతా రవీంద్రనాథ్, బుడ్డి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కనగాల రవికుమార్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు ఎంతో తృప్తినిస్తాయి



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న విమలాభాను, పక్కన జెడ్పీటీసీ నాగమణి, జయపాల్ ఫిలిప్

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): సేవా కార్యక్రమాలు ఎంతో తృప్తినిస్తాయని విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్, మహిళా నాయకురాలు సామినేని విమలాభాను అన్నారు. సోమవారం గ్రామంలో చిల్లకల్లుకు చెందిన రెవరెండ్ జయపాల్ ఫిలిప్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉచితంగా కుట్టు మిషన్లు అందించటంతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత శిక్షణలతో పాటు గ్రామీణ మహిళలకు కుట్టుమిషన్లు అందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవద్దు

కంచికచర్ల : గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంటే.. గ్రామ పంచాయతీ నాయకులు మోకాలడ్డు పెడుతున్నారని ఎంపీటీసీ సభ్యులు గుదే సరస్వతి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గొట్టుముక్కలలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ సచివాలయ వ్యవస్థను నెలకొల్పారన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం అడిగిన వెంటనే నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్‌ల సహకారంతో ఎంపీపీ షేక్ మలక్ బషీర్ మండల పరిషత్ నుంచి రూ. 50లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో గ్రామంలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులు, బోరు పంపులు, తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు పంచాయతీ సర్పంచిని గ్రామపంచాయతీలో తీర్మానం ఇవ్వమంటే వాటిని తిరస్కరిస్తున్నారని అన్నారు. టీడీపీ మద్దతుదారుడు సర్పంచి కావటం వల్లే ఇలా చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా పార్టీలకతీతంగా గ్రామ నాయకులు సమన్వయంగా పనిచేసి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు సహకరించాలని సరస్వతి కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ సర్పంచి గుదే రంగారావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గుదే అక్కారావు, నాయకులు గుదే శ్రీ వెంకటేశ్వరరావు, ఆలోకం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



కంచికచర్లలో గద్దర్ ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కంచికచర్ల : ప్రజా యుద్ధ నౌక ప్రజాకవి గద్దర్ మృతికి నివాళులు అర్పిస్తున్నామని బహుజనుల రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీ అన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గద్దర్ ఫ్లెక్సీకి సోమవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ మేరకు సోనీ మాట్లాడుతూ, గద్దర్ తన పాట, మాట ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చాడన్నారు. భూమి ఉన్నంతకాలం గద్దర్ గొంతు వినపడుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి మాట్లాడుతూ, ప్రజల్లో నిరంతరం గద్దర్ గళం రగులుతుందని తెలిపారు. కారంచేడు, చుండూరు పోరాటంలో గద్దర్ పాట ఉద్యమమయిందని అన్నారు. దళిత నాయకులు శేషం స్వామి, కర్ల రవికుమార్, బెజ్జం భూషణం, గణపతి, కుమార్, నవీన్, వేల్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

భవానీపురం(విజయవాడపశ్చిమ): జీవితాన్ని నాశనం చేసే మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలని, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని ఎరూషలేము ప్రార్థనా మందిరంలో కాలనీ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ సభ్యులకు మాదక ద్రవ్యాలు - సోషల్ మీడియా దుర్వినియోగంపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు బానిసలైపోతున్నారని, సరైన అవగాహనతో మాదక ద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేయవచ్చన్నారు.